# హరిశ్చంద్రుడు

పెనుమర్తి కామేశ్వరరావు

నేను కాలేజి లెక్చరర్ అయిన తరవాత కూడా పిలక తీయించలేదు. సంధ్య వార్చడం, మడి కట్టుకుని జపం చెయ్యడం. క్షౌరాలకు ప్రయాణాలకు వారాలు తిధులు వర్జ్యాలు సరిచూడటం మానలేదు. కాని, త్వరలో నా పద్ధతియావత్తూ ఇతర లెక్చరర్లకూ విద్యార్థులకూ తెలిసిపోయి, నా అలవాట్లు పరమ ఛాందసంగా, లోకం అర్థం చేసుకోనడం ప్రారంభించగా, నా పిలకమీద, నా పద్ధతిమీద నాకే యేవగింపు కలగ నారంభించింది! కాని నేను వేషం మార్చలేదు. నా ప్రవర్తన కొంత మారడం మూలంగా నా కకస్మాత్తుగా ముఖంలో మచ్చలు బయలుదేరి, నాకు నపుంసకత్వం లేదని రుజువు చేసుకో గలిగాను. నేను శ్రీరాముణ్ణి, బుద్ధుణ్ణి కానని అదిదరూ తెలుసుకోవడం నాకు సంతోషాన్ని కలిగించింది, అద్దంలో నా ముఖంలోని మార్పును చూచుకొన్నప్పుడల్లా!

నాకు ఏభయి ఏళ్లు వచ్చేటప్పటికి నేను దశరధుణ్ణయినాను: అంటే, నా కౌసల్య చచ్చిపోవడం, నా కైకేయి లేచిపోవడం, నా సుమిత్ర మిగలడం! సంతానం లేదు. నేను ధర్మపరుడ్ననీ, హరిశ్చంద్రుడి అవతారమనీ అంటున్నారు విద్యార్థులు! వాళ్లను తగలేసిరి! వాళ్ళకేం తెలుసు నేను ఎన్ని చిల్లర బాకీలు యెగకొట్టిందీ అదీను!

ఏమైనా సరే నేను పత్తి వెధవనన్న సంగతి నలుగురు తెలుసుకుంటేనేగాని నా మనస్సు శాంతించే లాగున కన్పించలేదు! నాకు నీతీ జాతీ లేదని నలుగురూ తెలుసుకోనడం నా ఖ్యాతిని ఇనుమడింప చేసేమాట వాస్తవం. ఏ పనిచేస్తే నేను నిఖాల్సయిన దగాకోరును కాగలనో చాలా కాలం ఆలోచించాను. అందుకోసం పుస్తకాలు కొని చదివాను. పత్రికలు చదివాను. కాని ఉపాయం అనే వస్తువ జ్ఞానేంద్రియానికి గోచరించలేదు. నేను నా వృద్ధాప్యంలో మంచివాడనే అపకీర్తితో చచ్చిపోవడం సహించరానిదై, నాగుండెమీద బండవాగున కూచుంది!

౨

పరీక్ష హాలంతా విద్యార్థులతో కన్నుల పండువుగా వుంది. గంట కొట్టారు. ఒక విద్యార్థి సూటు, హాటుకూడా వుంది, త్వరత్వరగా నావద్దకు వచ్చి.

'నా కలం యివ్వండి!' అన్నాడు నా కోటు జేబులవైపూరికే చూస్తూ.

'నీ కలం నా దగ్గర యెందుకుంది?' అన్నాను తడుముకోకుండా!

'ఇందాక ఒంటిగంటకు నా పార్కర్ కలం పరీక్ష పేపర్ల ఆన్సర్లమీద ఏదో రాసి వస్తానని తీసుకొని, మధ్యాహ్నం పరీక్షవేళ ఇస్తానన్నారు. బెల్లుకూడా అయింది. త్వరగా ఇవ్వండి' అన్నాడు ఆతృతతో. చెమటతో.

'నీ కలం నేను యెరగను. ఎవరికిచ్చావో బాగా జ్ఞాపకం చేసుకో!' అన్నాను.

'మీకే యిచ్చానండి! అది నాదికూడా కాదండి. నా స్నేహితుడిది. దానికి యెక్కువ సిరా పడుతుందనీ తెచ్చుకున్నానండి. బాగా రాస్తుందండి! నా స్నేహితుడు ఆ కలంతో రాసే ఫస్టుక్లాసులో వచ్చాడుట, లావాటి, లోతైన గద్గద కంఠంతో 'కలం ఇవ్వండిసార్!' అన్నాడు ఆదుర్దాతో.

'నీ కలం నా కసలు తెలియదంటుంటే నన్నడుగుతావేం? పోయి కూచో!' అన్నాను, నా పొడుంకాయ బయటికి తీసి. అతను నిట్టూర్పుతో, దుఃఖవదనంతో కోపంతో యింటికి పోయి కలం సిరాబుడ్డి తెచ్చుకున్నాడు. అరగంట లేటయింది. నేను వాచర్ని; లోపలికి రానిచ్చాను!

సాయంత్రం నా వెంట పడ్డాడు. ప్రాధేయపడి అడిగాడు. యుద్ధం వచ్చిం తరవాత పార్కర్ కలాలు రావటం లేదన్నాడు. 'నే నెరగన'ని దబాయించాను. విద్యార్థుల యెదుట నేను సంతోషించే భాషలో నన్ను బూతులు తిట్టాడు; నేను నవ్వాను. నన్ను చావకొడ్తానన్నాడు కలం యివ్వకపోతే. అందరూ విద్యార్థులూ, విద్యార్థినులూ జేరి వాణ్ణి మందలించారు. 'ఆయన హరిశ్చంద్రుడురా, బుద్ధ మూడడురా!' అని వాణ్ణి చివాట్లు పెట్టారు. నా దురదృష్ట మనుకున్నాను అది! వాడు నన్ను కొట్టలేదు. పరీక్ష లయిపోయిం తరవాత కూడా బ్రతిమాలాడు. నేను వినదలచుకోలేదు.

నేను రిటైరైన సంవత్సరం అతను మావూరి సబ్ యినస్పెక్టరుగా వచ్చాడు. నాకు భయం వేసింది. అందువల్ల మా అబ్బాయి ఆడుకుంటూ పాడుచేసినట్టి, అతనిదైయున్న పార్కర్ కలం, అతన్ని మాయింటికాహ్వానించి యిచ్చివేచి అన్నాను:

'నాకు హరిశ్చంద్రుడని అపకీర్తి వచ్చింది. అది పోగొట్టుకొని కీర్తితో బ్రతుకుదామని, నీ కలం - అడిగి పుచ్చుకుని అబద్ధాలాడి ధన్యుణ్ణయాను. కలంబాగాపాడయింది. కొత్త పాళీ వేయించుకుని రాసుకో, లేదా, నీ స్నేహితుడి కిచ్చెయ్యి నీయిష్టం!'